06ATP27_06ATP27.qxd 11-10-2024 PM 11:20 Page 1



# భక్తిశ్రద్ధలతో మహర్నవమి పర్వదిన వేడుకలు

**- ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన ఉద్భవలక్ష్మి అమ్మవారు - కొనసాగిన ప్రత్యేక పూజలు-కిటకిటలాడిన ఆలయాలు**







ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన ఉద్భవలక్ష్మి అమ్మవారు, మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చిన దుర్గాభవాని, ఉరగాద్రి చౌడేశ్వరి, ఈశ్వరమ్మ అమ్మవార్లు , రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన భగళాముఖి అమ్మవారు

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

ఈనెల 3వ తేది నుండి ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ అష్టమి, మహర్నవమి పర్వదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో స్వయంభూవుగా వెలసిన ఉద్భవలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉరవకొండ పట్టణంలోని దుర్గాభవాని అమ్మవారు, ఉరగాద్రి చౌడేశ్వరి, ఈశ్వరమ్మ ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలోని భగళాముఖి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉదయం మోదలు వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు పంచామృతాభిషేకం, లలిత సహస్రనామాలు, చండీపారాయణం, దుర్గా హోమం, దేవిభాగవత పారాయణం, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## సరసమైన ధరలతో వంట నూనెల విగ్రయాలకు 3 ప్రత్యేక కౌంటర్లు

**- లాంఛనంగా ప్రారంభించిన తహశీల్దార్ మహబూబ్‌బాషా, సీఎస్‌డీటీ రాము**

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



వంటనూనెల విక్రయ కేంద్రంను ప్రారంభిస్తున్న దృశ్యం

సరసమైన ధరలతో వంట నూనెలను విక్రయించడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనలతో రెవిన్యూ అధికారులు ఉరవకొండ పట్టణంలో కిరాణి హోల్‌సేల్ దుకాణాల వద్ద 3 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. కౌంటర్లను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించిన అనంతరం తహశీల్దార్ మహబూబ్‌బాషా, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ రాము మాట్లాడుతూ వంట నూనెల ధరలు పెరిగిన క్రమంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కౌంటర్లలో పామాయిల్ 110 రూపాయలు, సన్ ఫ్లవర్ ఆయిల్ 124 రూపాయలు లీటర్ చొప్పున విక్రయాలు జరుగుతాయన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## దసరా పండుగ కొనగోళ్ల సందడి..!

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



క్లాక్‌టవర్ సర్కిల్‌లో పండుగ కొనగోళ్ల సందడి

దసరా పండగ కొనగోళ్లతో నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణం శుక్రవారం కిటకిటలాడింది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహర్నవమి పర్వదినం కావడంతో వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ప్రైవేటు కార్యాలయాల్లో ఆయుధపూజలు కొనసాగాయి. ఉదయం మొదలు సాయంత్రం వరకు పూజా సామాగ్రి కొనడానికై పట్టణ, గ్రామీణ ప్రాంతాలనుండి పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంతో క్లాక్‌టవర్, తెలుగుతల్లి విగ్రహం, వైఎస్‌ఆర్ సర్కిళ్లతోపాటు, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో సందడి నెలకొంది. పండుగ రోజులు కావడంతో పూలు, మామిడాకులు, కూరగాయలు, పండ్లు, ఫలాల ధరలు అమాంతం పెరిగిపోవడంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా బట్టలు, రెడిమేడ్ దుస్తుల దుకాణాలు కిటకిటలాడగా బట్టల ధరలు సైతం బాగా పెరిగిపోయాయని ప్రజలు వాపోయారు. సకాలంలో వర్షాలు కురవడం ఖరీఫ్ పంట కాలంలో సాగు చేసిన కంది, వేరుశెనగ పంటలు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వచ్చే పరిస్థితులు ఉండగా రబీ పంట కాలంలో పప్పుశెనగ సాగుకు అనువైన పరిస్థితులు ఉండటంతో రైతుల్లో ఆనందోత్సవాలు కనిపిస్తున్నాయి. మహర్నవమి సందర్భంగా సాయంత్రం వివిధ దేవాలయాల్లో అమ్మవార్ల మూలవిరాట్‌లను దుర్గాదేవి, మహిషాసుర మర్ధినిలా ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నా, పెద్ద వాహనాలు, ఇతరత్రా వస్తువులను పూలతో ముస్తాబుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో ముళ్ల పొదలు, చెత్త శుభ్రం చేయించిన పంచాయతీ

**- గుంతకల్లు రోడ్డులో ఎక్సైజ్ కార్యాలయం నుండి డంప్ యార్డు వరకు శుభ్రం**

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



రోడ్డు పక్కన ముళ్ళ చెట్లను జేసీబీతో శుభ్రం చేయిస్తున్న పంచాయతీ సిబ్బంది

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు గుంతకల్లు రోడ్డులోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం నుండి పంచాయతీ డంప్ యార్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు, మట్టికుప్పలు, వ్యర్థాలను మేజర్ గ్రామ పంచాయతీ శుక్రవారం జేసీబీతో శుభ్రం చేయించింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ దసరా పండుగ రోజున ప్రజలకు జమ్మి చెట్టువద్దకు అమ్మవారికి, స్మశాన వాటికలకు పెద్దలకు పూజలు చేయడానికి వెళతారని రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు, మట్టికుప్పలు, వ్యర్థాలు ఉంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెంటనే శుభ్రం చేయించాలని పయ్యావుల సోదరులు ఆదేశించారని వివరించారు. వారి ఆదేశాల మేరకు శుభ్రత కార్యక్రమాన్ని పూర్తీ చేయడం జరిగిందన్నారు.

## విద్యాభ్యాసానికై మిత్రుని కుమార్తెకు ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

పట్టణంలో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న అన్వర్ కుమార్తె ఎంబిబిఎస్ సీటు సాధించడంతో తోటి మిత్రులు అభినందిస్తూ ఆర్థికంగా చేయూతనందించారు. ఆటో డ్రైవర్ అన్వర్ కుమార్తె సుమయ్య నెల్లూరు మెడికల్ కళాశాలలో ఉచిత సీటు సాధించింది. ప్రభుత్వ కళాశాలలో చదివి ఎలాంటి కోచింగ్ లేకుండా ఆమె సీటు సాధించడంతో మిత్రులు అభినందించారు. ఈ మేరకు 1988-89 ఎంఎస్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల బృందం ఆమెకు 50 వేల రూపాయల ఆర్థిక చేయూతనందించారు. భవిష్యత్తులో ఆమెకు అండగా వుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యార్థిని సత్కరించారు.

## వాసవిదేవస్థానంలో ఘనంగా హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అమ్మవారిశాలలో శుక్రవారం హోమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మహర్నవమి గణపతి, నవగ్రహ, లక్ష్మినారాయణ, గౌరీరుద్ర వాణి బ్రహ్మ నవగ్రహ దేవి దుర్గాదేవి వాసవి కన్యకాపరమేశ్వరి మూలమంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఈ హోమాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మహాపూర్ణాహుతి, మహామంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## భారీ వర్షానికి కూలిన సిద్ధేశ్వరస్వామి ఆలయం ప్రహరీగోడ

**అమరాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



కూలిన సిద్ధేశ్వరస్వామి ఆలయం ప్రహరీగోడ



మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి దేవాలయం ప్రహరీగోడ కూలింది. ముఖ్యంగా ఈ దేవాలయం కేంద్ర పురావస్తుశాఖ పరిధిలోకి రావడంతో పురాతన కాలంలో నిర్మించిన కట్టడాలు మరమ్మతులు చేయడానికి అనుమతులు లేని కారణంగా ఉన్న పురాతన కట్టడాలు కూలిపోయి శిథిలావస్థకు చేరుతున్నాయి. దేవాలయం ప్రాంగణంలో వున్న ప్రహరీగోడ కూలిపోవడంతో దేవాలయానికి భద్రతపరమైన సమస్యలు తలెత్తే అవకాశాలు వున్నట్లు తక్షణం సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతు చేయించాలని హేమావతి గ్రామ ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

## నూతన సిఐని కలిసిన తేదేపా నాయకులు

**విడపనకల్లు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

ఉరవకొండ రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన చిన్నగౌస్‌ను విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి పుష్పగుచ్చం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, కంద్యాల నారాయణస్వామి, కె.శ్రీనివాసరావు, కె.చిన్నవన్నూరుస్వామి, మఠం చెన్నన్న, తదితరులు పాల్గొన్నారు.



సిఐని సన్మానించిన దృశ్యం

## ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- వినతిపత్రం ద్వారా సమస్యలను డిపో మేనేజర్‌కు తెలియజేసిన యూనియన్ నాయకులు - 5 రోజు నిరసన తెలిపిన ఏపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్**

**ధర్మవరం రూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరిని వీడి వెంటనే సమస్యలను పరిష్కరించే దిశగా డిపో మేనేజర్ వ్యవహరించాలని యూనియన్ నాయకులు కోరారు. డిపో పరిధిలో ఉద్యోగులపై పని ఒత్తిడి పనిభారానికి నిరసన తెలుపుతూ 5 రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఓటి శాతం అధికం కావడం వలన ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగి మానసికంగా ఇబ్బంది పడుతున్నారని ఏపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వయసు పెరిగి కుటుంబ భారంతో పదవీ విరమణ చేయాల్సిన సమయంలో ఉద్యోగుల పట్ల ఇలాంటి పని ఒత్తిడి పని భారం వల్ల మానసికంగా వేధించడం సబబు కాదని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఏ డిపోలోను వ్యవహరించని తీరును దర్మవరం డిపోలోనే అధికారులు వ్యవహరించడం బాధాకరమన్నారు. 1/2019, సరు ్క్యలర్ అమలు చేయకుండా 70, 71 సర్క్యులర్ పేరిట ఉద్యోగులను మానసికంగా పనిష్‌మెంట్ల రూపంలో వేదించకూడదని యాజమాన్యం ఉద్యోగులపై పెంచిన పనిభారాలు వెంటనే తగ్గించాలని వారు కోరారు. ఉద్యోగుల సమస్యలపై అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్చలు నిర్వహించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అట్లు పరిష్కరించిన యెడల ఇప్పటి వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఉద్యోగులు ఈ నెల 14 నుంచి ఎర్ర బ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమాలు మరింత ఉద్రిక్తం చేస్తామని, యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫా, మల్లికార్జున మూర్తి తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## చురుకుగా బిజెపి సభ్యత్వ నమోదు

**అగళి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

బిజెపి సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అగళి మండల బూత్ మెంబర్ 155లో మాజీ అసెంబ్లీ కన్వీనర్ వీరచిక్కప్ప, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు ఉమేష్ చంద్ర, అసెంబ్లీ కో కన్వీనర్ బసవరాజు, బిజెవైఎం జిల్లా కార్యదర్శి రామయ్యగౌడ్, యూత్ లీడర్ అశోక్, నాగేంద్రప్ప, తిమ్మప్ప, తిప్పన్న, కిష్టప్ప తదితరులు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అగళి మండలంలో బిజెపి సభ్యత్వం తీసుకోవడానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో వస్తున్నట్లు వారు తెలిపారు.

## కాళీమాత అవతారంలో మహాలక్ష్మి

**అగళి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



మహాలక్ష్మిని అలంకరించిన దృశ్యం



వీరభద్రస్వామిని అలంకరించిన దృశ్యం

రంగనగిరి గ్రామంలో వెలసిన పురాతన కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారిని శరన్నవరాత్రుల్లో భాగంగా రోజుకొక రూపంలో భక్తులకు కనువిందు చేస్తోంది. శుక్రవారం ఖాళీమాత రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రులతోపాటు అమ్మకు ప్రీతి కరమైన రోజు శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా మధూడి వీరభద్ర స్వామిని సైతం రోజుకో రూపంలో అలంకరిస్తున్నారు. మహానవమి, ఆయుధ పూజ, కాశీ అలంకారంతో వీరభద్ర స్వామిని అలంకరించారు. రోజుకో రూపంలో నవరాత్రుల్లో భాగంగా వీరభద్ర స్వామిని అలంకరిస్తున్నారు. భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొంటున్నారు.

## కె.శివరం ఎస్‌సి కాలనీలో ఇంట్లోకి చేరిన వర్షం నీరు

**అమరాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



పరిశీలిస్తున్న సర్పంచు



ఇంటిలోకి చేరిన వర్షం నీరు

మండలంలోని కె.శివరం ఎస్‌సి కాలనీలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దాదాపు 20 ఇళ్లల్లోకి వర్షం నీరు చేరడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌సి కాలనీ ప్రజలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కె.శివరం పంచాయతీ సర్పంచు చిత్తన్న, వైస్‌ఎంపిపి కృష్ణమూర్తి, నాయకులు నరేష్, అంబరీష్, బాబు, తదితరులు సందర్శించారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే ఎస్‌సి కాలనీ వుండడంతో రోడ్డు ఎత్తుగా వుండడంతో వచ్చిన వర్షం నీరు అక్కడే నిల్వ వుండి ఇళ్లలోకి ప్రవేశించినట్లు బాధితులు తెలిపారు. ఇళ్లలోకి నీరు చేరడంతో రేషన్ తడిసిపోయినట్లు బాధితులు తెలిపారు. గత నాలుగు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు చెరువు మరువ పారిన సందర్భంలో కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైనట్లు వాపోయారు. తమకు సంబంధిత అధికారులు న్యాయం చేయాలని బాధితులు మంజునాథ్, పాతన్న, సిక్కరప్ప, నరసింహప్ప, మైలారప్ప, మూర్తి, కదరప్ప, లక్కమ్మ, ఎంజారప్ప, బోపురాజు, పుట్టన్న, తదితరులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షం వస్తేనే జలమయం అవుతున్నట్లు అనేకమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్‌సి గుండుల తిప్పేస్వామి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బి ఏఇ నరసింహమూర్తి దృష్టికి ప్రభాతవార్త తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు తెలియచేసి న్యాయం చేయడానికని కృషి చేస్తామని పేర్కొన్నారు.

## విద్యుత్ స్తంభానికి రక్షణగా కాంక్రీట్ దిమ్మె ఏర్పాటు

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



కాలనీలో తుప్పుపట్టిన ఇనుప స్తంభానికి కాంక్రీట్ దిమ్మెను రక్షణగా ఏర్పాటు చేశారని చూపుతున్న కాలనీవాసులు

పట్టణంలోని 19వ వార్డులో అడుగు భాగం తుప్పు పట్టి ప్రమాద స్థాయిలో వున్న ఇనుప విద్యుత్ స్తంభానికి అధికారులు ఎట్టకేలకు సిమెంటు కాంక్రీట్ దిమ్మెను రక్షణగా ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభం భారీ గాలివానకు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో పలుమార్లు పిర్యాదు చేయడంతో సంబంధితశాఖ అధికారులు స్పందించారు. ఈక్రమంలోనే ఇప్పుడున్న స్తంభం కూలిపోకుండా అడుగు భాగంలో సిమెంట్ కాంక్రీట్ దిమ్మెను ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక కాలనీ ప్రజలు ఎం.రఫీక్, జయమ్మ, హరి తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల టెండర్ల అవకతవకలపై విచారణ జరపండి

**-ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శేఖర్**

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శేఖర్

అనంతపురం జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిళం లక్ష్మినరసింహ స్వామి ఆలయం లో ఈ ఏడాది లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్ల చేయడానికి జరిగిన టెండర్ల ప్రక్రియలో జరిగిన అవకతవకలు, కాంట్రాక్టర్లకు పనుల కేటాయింపుపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సబ్ లీజుదారు, ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు నీడ సౌకర్యం కోసం చలువ పందిళ్ల ఏర్పాటు టెండర్‌ను అనంతపురానికి చెందిన గౌతంరెడ్డి ఆలయ అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా దక్కించుకున్నారని ఆరోపించారు. అడ్డదారిలో టెండర్‌ను దక్కించుకున్న సదరు వ్యక్తి పనులు చేయకుండా తనకు సబ్ లీజుకు ఇచ్చారన్నారు. తాను పనులు పూర్తీ చేసినప్పటికీ కాంట్రాక్టర్ బిల్లు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడంతోపాటు ఇదేమని అడిగితే బెదిరింపులకుదిగి దూషిస్తున్నారని వాపోయారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆలయంలో టెండర్లలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి పనులు చేసిన సబ్ లీజుదారులకు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు దక్కించుకుంటూ సబ్ లీజుదారులకు డబ్బులు చెల్లించకుండా దోచుకొంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొంటూ దూషణలకు దిగుతున్నందున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని కె.శేఖర్ డిమాండ్ చేశారు.

## ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**-నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు**

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సయ్యద్ చిన్న గౌస్‌ను ఉరవకొండ పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ చిన్నగౌస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారు షాలువాలుకప్పి



సీఐ చిన్నగౌస్‌ను సన్మానిస్తున్న నింబగల్లు టీడీపీ నాయకులు

పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంపట్ల పూర్తీ అవగాహన ఉన్న చిన్నగౌస్ రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టడం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం, ఆయన నేతృత్వంలో శాంతిభద్రతల పరిరక్షణ బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, నాయకులు వేల్పుల శ్రీనివాసులు, వేల్పుల వాసుదేవుడు, గమ్ ప్రభాకర్, బీరే శేఖర్, వడ్డే లాలుస్వామి, ప్రభాకర్, రమేష్, శంకర సుదర్శన్, నాగేశ్వరరావు, ప్రతాప్, వరప్రసాద్, విశ్వనాథ్, జమీల్, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా సాయంత్రం నింబగల్లు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు జెట్టి అన్వేష్, నేలపాటి నూతన్‌రామ్, కోకా భగవాన్, గోవిందు, బసన్నగౌడ్ తదితరులు సీఐ చిన్నగౌస్‌ను కలిసి సన్మానించారు.

## వలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధపూజ

**అమరాపురం, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

మండలంలోని వలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయుధపూజ కార్యక్రమాన్ని విద్యుత్ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యుత్ ఏఇ సిద్ధేశ్వర పాల్గొని పూజలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వలస, వి.అగ్రహారం విద్యుత్‌లైన్‌మెన్ మధు, ఫోల్ టు ఫోల్ వర్కర్ నాగరాజు, ఆపరేటర్ సీతారామ, అమరాపురం లైన్‌మెన్ వెంకటరాజు, గోవింద్, పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.



ఆయుధపూజ నిర్వహించిన దృశ్యం

